


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4 PM www.suryaa.com

శుక్రవారం

12 ఏప్రిల్ 2024

పేజీలు: 02




## లోయలో పడిన బస్సు.. 17 మంది మృత్యువాత

పాకిస్తాన్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 17 మంది మృతి చెందారు. 38 మంది గాయపడ్డారు. సింధ్, బలోచిస్తాన్ ప్రావిన్స్‌ల సరిహద్దుల్లోని హుబ్ పట్టణ సమీపంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సింధ్ ప్రావిన్స్‌లోని తట్టా పట్టణానికి చెందిన కొందరు బలోచిస్తాన్‌లోని హుబ్ పట్టణంలోని షా నూరానీ దర్గాకు బుధవారం మధ్యాహ్నం బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బస్సు రాత్రి 8 గంటల సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కన లోయలో పడిపోయింది. క్షతగాత్రులను అక్కడికి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరాచీ నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# రౌస్ అవెన్యూ కోర్టుకు ఎమ్మెల్సీ కవిత



ఎమ్మెల్సీ కవితను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో సీబీఐ హాజరు పరిచింది. సీబీఐ కస్టడీపై ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఉత్తర్వులను రిజర్వ్ చేశారు. కాగా, అరెస్టు చేస్తున్నారన్న విషయం రాత్రి 10.30 గంటలకు జైలు అధికారులు చెప్పారని న్యాయమూర్తి దృష్టికి కవిత తీసుకొచ్చారు. న్యాయవాదులతో మాట్లాడాలని చెప్పానని, అయినా అరెస్టు చేశారన్నారు. సీబీఐ అరెస్టు అక్రమమని, దర్యాప్తు సంస్థ తప్పు చేస్తున్నదని చెప్పారు. సీబీఐ విచారణ, అరెస్టులపై రెండు అప్లికేషన్లు వేశామని కవిత తరఫు న్యాయవాది చెప్పారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నప్పుడు కోర్టు అనుమతి లేకుండా అరెస్టు చేయడం కుదరదన్నారు. కవిత విషయంలో సీబీఐ నిబంధనలు పాటించలేదని వెల్లడించారు. కాగా, కవితను ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని సీబీఐ కోరుతున్నది. తీహార్ జైలులో కస్టడీలో ఉన్న కవితను సీబీఐ గురువారం అరెస్టు చేసింది. ఐపీసీ 477, 120(అ), పీసీ చట్టం 7 సెక్షన్ల ప్రకారం ఆమెను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించింది. ఆమెను శుక్రవారం ట్రయల్ కోర్టులో హాజరుపర్చనుంది. కాగా కవితను సీబీఐ అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఆమె తరఫు న్యాయవాది మోహిత్‌రావు గురువారం రౌస్ ఎవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రంజాన్ సెలవు దినం కావడం, ఈ కేసుకు సంబంధించిన సమాచారం లేదని ప్రతివాదులు చెప్పడంతో ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ సాధ్యం కాదని కోర్టు తెలిపింది. రెగ్యులర్ కోర్టులోనే ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించింది. కవిత అరెస్టును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలన్న విజ్ఞప్తిమేరకు గురువారం సాయంత్రం 4.55 నిమిషాలకు ప్రత్యేక న్యాయమూర్తి మనోజ్‌కుమార్ విచారణ చేపట్టారు. కవిత తరఫున న్యాయవాది నితేశ్ రాణా వర్చువల్‌గా, మోహిత్‌రావు ప్రత్యక్షంగా వాదనలు వినిపిస్తూ.. సీబీఐ చర్యలు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. సీబీఐ చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని, నిబంధనలను తుంగలోకి తొకిందని అన్నారు. సీబీఐ కనీస ప్రమాణాలు పాటించలేదని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వాలన్న ఉన్నత న్యాయస్థానాల ఆదేశాలను సీబీఐ పాటించలేదని తెలిపారు. పిటిషన్‌పై వాదనలు వినాలా? వద్దా? అన్న దానిపై ఇంకా నిర్ణయమే జరగలేదని జడ్జి మనోజ్ కుమార్ పేరొన్నారు. ఈ కేసుపై తన దగ్గర ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. మీకేమైనా సమాచారం ఉందా? అని సీబీఐ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ప్రశ్నించగా.. తనకూ ఎలాంటి సమాచారం లేదని జవాబు ఇచ్చారు. అసలు సీబీఐ అరెస్టు చేసిందని మీరెలా చెబుతున్నారని కవిత తరఫు న్యాయవాదిని కోర్టు ప్రశ్నించింది. కవితను అరెస్టు చేసినట్టు ఆమె భర్త అనిల్‌కు సీబీఐ సమాచారం ఇచ్చిందని మోహిత్‌రావు తెలిపారు. అయితే.. అత్యవసర కేసులను మాత్రమే తాము విచారిస్తామని, కాబట్టి ఈ విషయంలో కవితకు ఎటువంటి ఊరట ఇవ్వలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని రెగ్యులర్ కోర్టులోనే తేల్చుకోవాలని చెప్పారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని రెగ్యులర్ బెంచ్‌కు సూచించారు. ఈ దశలో న్యాయవాది మోహిత్‌రావు కల్పించుకుంటూ తమ అప్లికేషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కోరగా.. అందుకు జడ్జి అంగీకరించారు.



## ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

### ఫస్టియర్‌లో 67, సెకండియర్‌లో 78 శాతం ఉత్తీర్ణత

ఏపీ ఇంటర్ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరబ్ గౌర్ ఇంటర్ ఫలితాలను విడుదల చేశారు. తాడేపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఈ ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఫలితాలను కమిషనర్ ఒకే సమయంలో విడుదల చేశారు. ఈ ఫలితాల కోసం విద్యార్థులు bie.ap.gov.in, bieap.apcfss.in లో చెక్ చేసుకోవచ్చు. ఫస్టియర్‌లో 1,43,68 మంది విద్యార్థులు పాసవ్వగా.. సెకండియర్‌లో 1,41,465 మంది పాసయ్యారు. ఫస్టియర్‌లో 64 శాతం, సెకండియర్‌లో 75 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఫస్టియర్‌లో 1,67,187 మంది విద్యార్థినులు పాసవ్వగా.. సెకండియర్‌లో 1,65,063 మంది పాసయ్యారు. ఫస్టియర్‌లో 71 శాతం, సెకండియర్‌లో 81 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.



## ఇజ్రాయెల్‌కు 6000 మంది భారత కార్మికులు

హమాస్‌తో యుద్ధం కారణంగా సంక్షోభంలో చిక్కుకున్న ఇజ్రాయెల్‌ను భారత్ ఆదుకోనుంది. ఆ దేశానికి 6,000 మంది కార్మికులను ఏప్రిల్, మే నెలలో ఇజ్రాయెల్ పంపనుంది. వీరందరినీ ప్రత్యేక విమానాల్లో తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్మికుల ప్రయాణ ఖర్చుల్లో రాయితీ ఇవ్వాలని ఇజ్రాయెల్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 900 మంది భారత కార్మికులు అక్కడికి చేరినట్లు ఆ దేశ ప్రభుత్వం వెల్లడించింది.



## ఆ ప్రమాదం తర్వాత నా జీవితమే మారిపోయింది

గ్లామరస్ పాత్రలకు యాషికా ఆనంద్ పెట్టింది పేరు. కవలై వేండామ్ చిత్రం ద్వారా నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ.. ఆ తర్వాత ఇరుట్టు అరైయిల్ మురట్టు కుత్తు, ధృవంగళ్ 16, నోటా, జాంబీ తదితర సినిమాల్లో నటించింది. బిగ్‌బాస్ రియాలిటీ గేమ్ షోలో పాల్గొని, తమిళ ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. అయితే కొన్నాళ్ల ముందు ఫ్రెండ్స్‌తో కలిసి కారులో వెళ్తుండగా యాషికా ఆనంద్ భయంకరమైన కారు ప్రమాదానికి గురైంది. ఆ ప్రమాదంలో తీవ్రగాయాల పాలై ప్రాణాలతో పోరాడింది. మూడు నెలల తర్వాత తిరిగి మామూలు మనిషైంది. ఆ తరువాత మళ్లీ నటించడానికి సిద్ధమైంది. ఇటీవల 'సిల నేరంగళిల్' సినిమాలో నటించిన ఈ భామ ప్రస్తుతం ఇవన్ దాన్ ఉత్తమన్, రాజభీమ, పాంబాట్టం తదితర చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. కాగా తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యాషికా ఆనంద్ పలు ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చింది. తాను 17 ఏళ్ల వయసులోనే ఓ తమిళ సినిమా చేసినట్లు చెప్పింది. అలాంటి గ్లామర్ పాత్రల్లో నటిస్తే, నిజ జీవితంలోనూ అలానే ఉంటారని కొందరు అనుకుంటారని, చాలా అవమానకరమైన కామెంట్స్ చేస్తుంటారని చెప్పింది. చాలా నెగెటివ్‌గానూ మాట్లాడుతుంటారని ఆవేదన వ్యక్తం చేసింది.




## ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు.. యువకులు దుర్మరణం

సూర్యాపేట జాతీయ రహదారిపై అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. అర్ధరాత్రి దాటిన తర్వాత రోడ్డుపై ఆగిఉన్న డీసీఎంను కారు వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వ్యక్తిని సూర్యాపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. మృతులను మహ్మద్ నవీద్, నిఖిల్ రెడ్డి, రాకేశ్‌గా గుర్తించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నగ్న మెసేజ్‌లు.. ఇన్‌స్టాలో కొత్తగా బ్లర్ ఫీచర్

**కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెస్తున్న ఇన్‌స్టాగ్రామ్**
**లైంగిక దోపిడీపై పోరు, టీనేజర్ల రక్షణ కోసమే..**

లైంగిక దోపిడీపై పోరాటానికి, యువత రక్షణ కోసం తాము కొత్త టూల్‌ను ప్రవేశడుతున్నామని సామాజిక మాధ్యమ వేదిక ఇన్‌స్టాగ్రామ్ గురువారం ప్రకటించింది. డైరెక్ట్ మెసేజ్ కింద నగ్న చిత్రాలను పంపిన సమయంలో ఈ టూల్ వాటిని ఆటోమెటిక్‌గా బ్లర్ చేస్తుందని వెల్లడించింది. లైంగిక కుంభకోణాలు, ఇతర మార్గాల్లోని చిత్రాల దుర్వినియోగంపై ప్రచారంలో భాగంగా తాము కొత్త ఫీచర్లను పరీక్షిస్తున్నామని, టీనేజ్ వారిని నేరస్థులు సంప్రదించడం కఠినతరం చేస్తున్నామని వెల్లడించింది. లైంగిక దోపిడీలో భాగంగా నేరస్థులు డైరెక్ట్ మెసేజ్ మార్గంలో నగ్న చిత్రాలు పంపేలా అవతలి వారిని ఒప్పిస్తారు. అనంతరం డబ్బులు ఇవ్వకుంటే లేదా లైంగిక పరమైన అంశాల్లో తాము చెప్పినట్లు వినకుంటే వాటిని ఆన్‌లైన్‌లో ఉంచుతామని బెదిరిస్తారు. స్కామర్లు చాలా సందర్భాల్లో 'సన్నిహిత చిత్రాలు' పొందేందుకు డైరెక్ట్ మెసేజ్ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారని, అయితే డైరెక్ట్ మెసేజ్ నగ్నత్వ రక్షణ సదుపాయాన్ని తాము పరీక్షిస్తున్నామని ఇన్‌స్టాగ్రామ్ తెలిపింది. ఎవరైనా డైరెక్ట్ మెసేజ్‌లో నగ్న చిత్రాలను పంపితే ఈ ఫీచర్ వాటిని బ్లర్ చేస్తుందని వివరించింది.




## ఓటిటిలోకి వచ్చిన ప్రేమలు

తాజాగా మలయాళంలో రిలీజ్ అయి సంచలన విజయం అందుకున్న యూత్ఫుల్ లవ్ స్టోరీ మూవీ ప్రేమలు. మలయాళీ నటీనటులు నస్లెన్ కె గపూర్, మ్యాథ్యూ థామస్, మమితా బైజు ప్రధాన పాత్రలు పోషించిన ఈ మూవీని భావనా స్టూడియోస్ బ్యానర్ పై ఫహద్ ఫాజిల్, దిలీప్ పోతన్, శ్యామ్ పుష్కరన్ సంయుక్తంగా నిర్మించారు. ఈ మూవీకి గిరీష్ ఎ.డి దర్శకత్వం వహించగా విష్ణు విజయ్ సంగీతం సమకూర్చారు. ఇక ఈ మూవీని తెలుగులో రాజమౌళి తనయుడు కార్తికేయ రిలీజ్ చేయగా ఇక్కడ కూడా మంచి సక్సెస్ సొంతం చేసుకుంది. విషయం ఏమిటంటే, తాజాగా ప్రేమలు మూవీ ఓటిటి ఆడియన్స్ ముందుకి వచ్చింది. ఇన్నాళ్లు థియేటర్లలో ఈ లవ్ స్టోరీని మిస్ అయిన వారు ఇప్పుడు తెలుగు వర్షన్ ని ఆహాలో చూసేయొచ్చు. అలానే మరొక ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో తమిళ్, మలయాళం, హిందీ వెర్షన్స్ ఈ మూవీ అందుబాటులో ఉంది.

## ఓటిటిలోకి వచ్చేసిన గామి

యువ నటుడు విశ్వక్సేన్ హీరోగా చాందిని చౌదరి హీరోయిన్ గా విద్యాధర్ కాగిత దర్శకత్వంలో తెరకెక్కిన లేటెస్ట్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ గామి. విభిన్న కథ కథనాలతో ఆకట్టుకునే రీతిన రూపొందిన ఈ మూవీ ఇటీవల ఆడియన్స్ ముందుకి వచ్చి యావరేజ్ విజయం సొంతం చేసుకుంది. కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ మూవీలో అభినయ, హారిక పెద్ద, దయానంద్ రెడ్డి, మొహమ్మద్ సమద్ తదితరులు ఇతర కీలక పాత్రలు చేసారు. విషయం ఏమిటంటే, నేడు ఈ మూవీ ప్రముఖ ఓటిటి మాధ్యమం జీ 5 ద్వారా తెలుగు, తమిళ, కన్నడ భాషల ఆడియన్స్ ముందుకి వచ్చింది. మరి థియేటర్స్ లో పెద్దగా ఆకట్టుకోని ఈ మూవీకి ఓటిటి ఆడియన్స్ నుండి ఎంత మేర స్పందన లభిస్తుందో చూడాలి.






## ఓటీటీలో స్ట్రీమింగ్ కి వచ్చేసిన క్రేజీ రైడ్ ఓం భీం బుష్

ఈ ఏడాదిలో టాలీవుడ్ నుంచి వచ్చిన క్రేజీ హిట్ చిత్రాల్లో హిట్ ట్రియో శ్రీ విష్ణు, రాహుల్ రామకృష్ణ అలాగే ప్రియదర్శి కాంబినేషన్ లో దర్శకుడు శ్రీ హర్ష కొనుగంటి తెరకెక్కించిన కామెడీ హారర్ డ్రామా "ఓం భీం బుష్" కూడా ఒకటి. మరి ఇంట్రెస్టింగ్ ప్రమోషన్స్ నడుమ వచ్చిన ఈ చిత్రం శ్రీ విష్ణు కెరీర్ లో మరో సాలిడ్ హిట్ గా అయితే నిలిచింది. ఇక ఈ చిత్రం మరి ఫైనల్ గా ఓటీటీ ఎంట్రీ ఇచ్చేసింది. ఈ సినిమా హక్కులు అమెజాన్ ప్రైమ్ వీడియో వారు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. మరి ఈరోజు నుంచి ఈ చిత్రం అందులో అందుబాటులో కి వచ్చేసింది. మరి అప్పుడు మిస్ అయ్యి ఇప్పుడు చూడాలి అనుకునేవారు. తప్పకుండా ఈ సినిమాని ఓటీటీ లో ట్రై చేయవచ్చు. ఇక ఈ చిత్రంలో అయేషా ఖాన్ తదితరులు నటించగా సన్నీ ఎం ఆర్ సంగీతం అందించారు అలాగే వి సెల్యులాయిడ్ వారు నిర్మాణం వహించారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## నష్టాల్లో స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు సూచీలపై ప్రభావం చూపుతున్నాయి. ఉదయం 9:33 గంటల సమయంలో సెన్సెక్స్ 129 పాయింట్లు పతనమై 74,908 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 35 పాయింట్లు కుంగి 22,718 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.35 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో ఎన్టీపీసీ, ఎల్ అండ్ టీ, టాటా మోటార్స్, టీసీఎస్, పవర్‌గ్రిడ్, ఎంఅండ్ఎం, నెస్లే ఇండియా, విప్రో, బజాజ్ ఫైనాన్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. సన్‌ఫార్మా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మారుతీ, ఏషియన్ పెయింట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టైటన్, హెచ్‌యూఎల్, టాటా స్టీల్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.



## బంగ్లాపై గంజా సాగు.. బ్రిటన్ పౌరుడు అరెస్ట్

బంగ్లాపై గంజాయి సాగుచేస్తూ ఓ విదేశీయుడు పట్టుబడ్డాడు. బ్రిటన్‌కు చెందిన జేసన్ ఉత్తర గోవాలోని సాకారోలో నివాసం ఉంటున్నాడు. అతడు తన ఇంటిపై గంజాయి సాగుచేస్తున్నాడని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోకి సమాచారం అందించారు. అతని ఇంటిపై దాడిచేసిన అధికారులు.. ఇతర మొక్కలతోపాటు పూల కుండీల్లో గంజాయి సాగుచేస్తున్నట్లు గుర్తించారు. 33 గంజాయి చెట్లు, 10 గ్రాముల గంజా, రూ.40 వేలు సీజ్ చేశారు. దీంతో కేసు నమోదుచేసి జేసన్‌ను అదుపులోకి తీసుకున్నారు.కాగా, గతంలో కూడా ఎన్సీబీ అధికారులు అతడిని అరెస్టు చేశారు. 2022, నవంబర్ 28న అతనివద్ద 107 ఎక్స్‌టసీ ట్యాబ్లెట్లు, 40 గ్రాముల ఎండీఎంఏ పౌడర్, 55 గ్రాముల చరాస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అతడు బెయిల్‌పై ఉన్నాడు.



## యుద్ధానికి సిద్ధంగా ఉండండి: కిమ్

యుద్ధానికి సిద్ధంగా ఉండాలని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ తమ సైన్యానికి పిలుపునిచ్చారు. దేశంలోని సైనిక వర్సిటీని సందర్శించిన సందర్భంగా ఈమేరకు స్పష్టం చేశారు. 'శత్రువులు మనల్ని రెచ్చగొడితే చావు దెబ్బ తీయాలి. కేవలం సిద్ధంగా ఉండటమే కాదు. విజయాన్ని సాధించాలి. అందుకోసం అన్ని వనరుల్ని వినియోగించుకుందాం' అని సూచించారు.




## వడ్డీరేటు పెంచిన బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడా రుణ గ్రహీతలకు షాకిచ్చింది. లోన్లపై వడ్డీరేటును 5 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో ఒక్కరోజు రుణాలపై వడ్డీరేటు 8.05% నుంచి 8.10శాతానికి పెరిగింది. 3నెలల లోన్లపై 8.45శాతానికి చేరుకోగా, 6నెలల రుణాలపై 8.65%, ఏడాది రుణాలపై 8.85శాతానికి పెరిగింది. ఇవి నేటి నుంచే అమల్లోకి వస్తాయని బ్యాంక్ ప్రతినిధి ఒకరు తెలిపారు. అటు HDFC వడ్డీ రేటును పెంచడంతో గృహ రుణాలపై వడ్డీరేటు 9.05% నుంచి 9.8% మధ్య ఉంది.




# ఆంధ్రప్రదేశ్‌కు టెస్లా?

టెస్లా యాజమాన్యానికి ఇప్పటికే రెండు ఈ-మెయిల్స్ పంపామని, స్థల పరిశీలనకు రావాలని ఆహ్వానించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ ఏప్రిల్ 22న ప్రధాని నరేంద్ర మోదీని కలవనున్న నేపథ్యంలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను చేజిక్కించుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. టెస్లా కంపెనీకి రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తగినంత భూమి అందుబాటులో ఉందని తెలియజేసింది. ఒకవేళ టెస్లా ప్రైవేట్ భూమిని కొనుగోలు చేయాలనుకుంటే దానికి కూడా సహకారం అందించనున్నట్లు భరోసా ఇచ్చింది.

**అనంతపురం జిల్లాలో..**

"రాష్ట్రాన్ని సందర్శించి, వారి యూనిట్ ఏర్పాటుకు అవసరమైన భూములను పరిశీలించాలని టెస్లాను ఆహ్వానించాం. వారి స్పందన కోసం ఎదురు చూస్తున్నాం. అన్ని జిల్లాల్లో తగినంత భూమి అందుబాటులో ఉందని, వారు తమ ప్లాంట్‌ను నెలకొల్పేందుకు కావాల్సిన చోట భూమిని ఇస్తామని చెప్పాం. చెన్నై, బెంగళూరు, కృష్ణపట్నం ఓడరేవులకు సమీపంలో ఉన్నందున అనంతపురం జిల్లాలో కియా ప్లాంట్ సమీపంలో భూములను ప్రతిపాదించాం. ఇది బెంగళూరుకు దగ్గరగా ఉంటుంది. అలాగే చెన్నై, కృష్ణపట్నం పోర్టుకు దగ్గరగా ఉండాలనుకుంటే నాయుడుపేట, శ్రీ సిటీ సమీపంలో భూములు పరిశీలించవచ్చు" అని ఒక సీనియర్ అధికారి పేర్కొన్నట్లుగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఉటంకించింది.

**ఎన్నికల తర్వాత..**

టెస్లా బృందం రాష్ట్రానికి వచ్చి వారి అవసరాలకు తగిన ప్రదేశాన్ని ఎంపిక చేసుకుంటే వారికి ప్రభుత్వ భూమి లేదా ప్రైవేట్ పార్టీల నుంచి భూమిని కొనుగోలు చేసైనా అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారి వివరించారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత టెస్లా బృందాలు ఆంధ్రప్రదేశ్‌కి వస్తాయన్నారు. ప్లాంట్ నిర్మాణానికి 2,500 ఎకరాలకు పైగా భూమి అవసరమని అంచనా. మస్క్ ప్రధానిని కలుస్తున్నప్పటికీ ఎలక్షన్ కోడ్ కారణంగా టెస్లా తయారీ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన చర్చల ఫలితం బయటకు రాదని ఆ అధికారి అభిప్రాయపడ్డారు. వాస్తవానికి, 2021, 2022 సంవత్సరాల్లోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్లాంటు ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం టెస్లా అధిపతి ఎలాన్ మస్క్‌ను ఆహ్వానించింది. ఇప్పుడు మరోసారి మస్క్ భారతదేశ పర్యటన గురించి తెలు[redacted] తర్వాత ప్రతిష్టా[redacted] దక్కించుకునే[redacted] ప్రయత్నాలు వ[redacted] చేసింది.

## బుమ్రాకు శిరస్సు వంచి సలాం కొట్టిన సిరాజ్




ఐపీఎల్ 2024లో భాగంగా ఆర్సీబీతో నిన్న జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఘన విజయం సాధించింది. సొంత మైదానమైన వాంఖడేలో జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ అన్ని విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి ఆర్సీబీని మట్టికరిపించింది. తొలుత బౌలింగ్‌లో బుమ్రా (4-0-21-5) చెలరేగిపోగా.. ఆ తర్వాత బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్ (39 బంతుల్లో 69; 7 ఫోర్లు, 5 సిక్సర్లు), రోహిత్ శర్మ (24 బంతుల్లో 38; 3 ఫోర్లు, 3 సిక్సర్లు), సూర్యకుమార్ యాదవ్ (19 బంతుల్లో 52; 5 ఫోర్లు, 4 సిక్సర్లు), హార్దిక్ పాండ్యా (6 బంతుల్లో 21 నాటౌట్; 3 సిక్సర్లు) శివాలెత్తిపోయారు. సరదాసరదాగా సాగిన ఈ మ్యాచ్‌లో చాలా ఆసక్తికర సన్నివేశాలు తారసపడ్డాయి. అభిమానులు హార్దిక్‌ను గేలి చేస్తుంటే విరాట్ అడ్డు చెప్పడం.. దిగ్గజ క్రికెటర్లు విరాట్, రోహిత్ మధ్య సరదా సంభాషణ.. రోహిత్ దినేశ్ కార్తీక్‌ను ఆట పట్టించడం (మరో వరల్డ్‌కప్ ఆడాలని ఉందా అని).. ఇలా మ్యాచ్ మొత్తం సరదాసరదాగా సాగింది. మ్యాచ్ పూర్తయ్యాక ఇరు జట్ల ఆటగాళ్లు ఒకరినొకరు విష్ చేసుకోవడం చూపరులను ఆకట్టుకుంది. సిరాజ్ బుమ్రాకు శిరస్సు వంచి సలాం కొట్టడం హైలైట్‌గా నిలిచింది. ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగినందుకుగాను సిరాజ్ బుమ్రాకు సలాం కొట్టాడు. నిన్నటి మ్యాచ్‌లో జరిగిన ఆసక్తికర సన్నివేశాలకు సంబంధించిన వీడియో నెట్టింట సందడి చేస్తుంది. ఫ్యాన్స్ వీడియోకు ఫిదా అవుతున్నారు. హార్దిక్‌ను కోహ్లి వెన[redacted]సుకురావడాన్ని అభిమానులు తెగ మెచ్చుకుంటున్నారు. కాగా, నిన్నటి మ్యాచ్‌లో ఆర్సీబీపై ముంబై ఇండియన్స్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. డుప్లెసిస్ (61), రజత్ పాటిదార్ (50), దినేశ్ కార్తీక్ (53 నాటౌట్) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. బుమ్రా ఐదు వికెట్లతో చెలరేగాడు. అనంతరం 197 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ముంబై.. ఇషాన్, రోహిత్, స్కై, హార్దిక్ మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడటంతో 15.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి విజయతీరాలకు చేరింది. ఆర్సీబీ బౌలర్లు మరోసారి చెత్త ప్రదర్శన చేసి గెలిచే అవకాశలున్న మ్యాచ్‌ను ప్రత్యర్థికి పూలల్లో పెట్టి ఇచ్చారు.

## ఛాతి నొప్పితో ఆసుపత్రిలో చేరిన సాయాజీ షిండే..



టాలీవుడ్ ఇండస్ట్రీలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు సాయాజీ షిండే. ఎన్నో చిత్రాల్లో విలన్ పాత్రలు, సహాయ నటుడిగా కనిపించి మెప్పించాడు. చాలా కాలంగా తెలుగు లకు దూరంగా ఉంటున్న సాయాజీ షిండే నిన్న అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరినట్లు తెలుస్తోంది. గురువారం ఛాతిలో నొప్పి రావడంతో వెంటనే ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు కుటుంబసభ్యులు. కొన్ని పరీక్షలు చేసిన వైద్యులు ఆయన గుండెలో వెయిన్ బ్లాక్ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే యాంజియోప్లాస్టీ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సాయాజీ షిండే ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. త్వరలోనే ఆయనను డిశ్చార్జ్ చేయనున్నారు. కొన్ని రోజుల క్రితం సాయాజీ షిండేకు ఛాతిలో నొప్పి వచ్చిందని.. దీంతో వెంటనే ఆసుపత్రికి వచ్చి కొన్ని సాధారణ పరీక్షలు చేయించుకున్నారని అన్నారు వైద్యులు. ఈసీజీ టెస్ట్ చేగా.. అతడి 2D ఎకోకార్డియోగ్రఫీని పూర్తి చేసినప్పుడు.. గుండెలో వెయిన్ బ్లాక్ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఆ తర్వాత నిన్న మరోసారి ఛాతిలో నొప్పి రావడంతో వెంటనే అతడికి యాంజియోప్లాస్టీ చేశామని.. ప్రస్తుతం అతడి పరిస్థితి బాగానే ఉందని, మరో రెండు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అభిమానులు సాయాజీ షిండే త్వరగా కోలుకోవాలంటూ ప్రార్థనలు చేస్తున్నారు.




## బెంగళూరు కేఫ్‌లో పేలుడు కేసు..

### ఎన్ఐఏ అదుపులో ఇద్దరు కీలక నిందితులు

బెంగళూరు రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో మరో ఇద్దరు కీలక నిందితులను జాతీయ దర్యాప్తు సంస్థ తాజాగా అరెస్ట్ చేసింది. బెంగాల్‌కు చెందిన ముసావీర్ షాజీబ్ హుస్సేన్, అబ్దుల్ మాథీన్ అహ్మద్ తాహాను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎన్ఐఏ వర్గాలు వెల్లడించాయి. పేలుడుకు పాల్పడిన వారిలో ఈ ఇద్దరు ప్రధాన కుట్రదారుల్లో ఒకరుగా ఎన్ఐఏ అధికారులు ఇప్పటికే గుర్తించారు. పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వీరిద్దరి ఆచూకీ కనిపెట్టేందుకు ఎన్ఐఏ బృందాలు దేశవ్యాప్తంగా తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈ క్రమంలోనే వీరి ఆచూకీ కోసం ఎన్ఐఏ రూ.20 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించింది. ప్రధాన నిందితులైన ముసావీర్ షాజీబ్ హుస్సేన్, అబ్దుల్ మాథీన్ అహ్మద్ తాహాల సమాచారం తెలిపితే ఒక్కొక్కరిపై రూ.10లక్షల వంతున రూ.20 లక్షలను బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపింది. కేఫ్‌లో ముసావీర్ హుస్సేన్ షాజీబ్ ఐఈడీని అమర్చాడని పేర్కొంది. వీరి సమాచారం తెలిసిన వారు 080-29510900 ఫోన్ నంబర్‌కు కానీ, info. blr. nia@gov.in ఈ-మెయిల్‌కు సమాచారం ఇవ్వాలని కోరింది. బెంగళూరులోని ప్రముఖ రెస్టారెంట్ రామేశ్వరం కేఫ్‌లో మార్చి 1 శుక్రవారం బాంబ్ బ్లాస్ట్ ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ పేలుడులో మొత్తం 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో మాస్క్, క్యాప్ ధరించిన ఓ వ్యక్తి బస్సులో ప్రయాణించి కేఫ్‌కు వచ్చినట్లు గుర్తించారు. కేఫ్‌లో పేలుడు జరిగిన గంట తర్వాత అనుమానితుడు బస్సు ఎక్కినట్లు సీసీటీవీ ఫుటేజీలో రికార్డైంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు అనుమానితులను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



## ఆ అభిప్రాయం ఉంది..

# ప్రేక్షకులు మారాలి

[redacted] కథ బాగుంటే.. అందులో యాక్టర్స్ ఆడా? మగా? అనేది చూడరు. బ్యాడ్ లక్ ఏంటంటే ఇప్పటికీ చాలామంది నిర్మాతలు.. హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీస్ అంటే చిన్నచూపు చూస్తున్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. హీరోలు లేనప్పటికీ 'క్రూ' మూవీ బాగా ఆడుతోంది. ఇది చూసైనా సరే ఇండస్ట్రీలో మార్పు వస్తుందని ఆశిస్తున్నాను.' పైన కృతిసనన్ చెప్పింది నిజమే. ఎందుకంటే ఒకప్పుడు ప్రేక్షకులు.. హీరోల కోసం సినిమాలకు వచ్చేవారు. కానీ ఇప్పుడు మాత్రం కంటెంట్ బాగుందా? ఎంటర్ టైన్‌మెంట్ ఉందా? లాంటివి చాలా ఆలోచిస్తున్నారు. ఇందులో భాగంగా తన 'క్రూ' మూవీ హిట్టయ్యేసరికి కృతి ఈ వ్యాఖ్యలు చేసింది. ఈమె చెప్పిన దానిబట్టి చూస్తే హీరోలకు అంత సీన్ లేదని అన్నట్లేగా! ఇకపోతే కృతి సనన్.. మహేశ్ 'వన్ నేనొక్కడినే', ప్రభాస్ 'ఆదిపురుష్' చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది.